నిరాశ్రయులకు బాసటగా స్వచ్ఛంద సంస్థలు



కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద మాట్లాడుతున్న ఎంవీ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

కాచిగూడ: 'జాయ్ ఆఫ్ గివింగ్'లో భాగంగా కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద పీపుల్స్ కలెక్టివ్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 'అండర్ ది స్టార్స్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు ప్రతీ లక్ష మంది జనాభాకు ఒక నిరాశ్రయ షెల్టర్ ఉండాలని కానీ కోటిన్నర జనాభా కలిగిన నగరంలో కేవలం 13 మాత్రమే ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో నిరాశ్రయ షెల్టర్ల సంఖ్య పెంచి ప్రస్తుతం నడుస్తున్న షెల్టర్ నిర్వహణ వ్యయం పెంచాలని కోరారు. రోడ్లపై నిరాశ్రయులు లేకుండా స్వచ్ఛంద సంస్థల సహకారంతో తగిన చర్యలు ప్రభుత్వం వెంటనే తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, విద్యార్థులు, ఇందిరా, జయశ్రీ, అంబికా, అనురాధ, వెంకట్‌రెడ్డి, అరుణ, రాంజీ, రేణుక, రాము, ఫిరోజ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రూపుల వసంతకు నివాళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ సామాజికవేత్త రూపుల వసంత వర్ధంతిని శుక్రవారం శ్రీరాంనగర్‌బస్తీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూపుల వసంత ట్రస్ట్ చైర్మన్ ఆర్. వివేక్ ఆధ్వర్యంలో హాస్‌ఫెడ్ డైరెక్టర్ అయిలినేని కిషన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

9న తరగతుల బహిష్కరణ, కలెక్టరేట్ల ముట్టడి

కాచిగూడ: ఫీజుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్‌తో ఈనెల 9న రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీల తరగతులను బహిష్కరించి... జిల్లా కలెక్టరేట్లను ముట్టడించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఫీజు బకాయిలు చెల్లించకపోతే యుద్ధం తప్పదని హెచ్చరించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌పేట ప్రాంతానికి చెందిన నాగ నారాయణమూర్తి కుమారుడు కె.సురేష్ కార్తీక్ (43) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల చుట్టూ తిరిగినా వ్యాధి నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మలక్‌పేట- డబీర్‌పుర రైల్వేస్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శారదా శరన్నవరాత్రుల ముగింపు

నల్లకుంట శంకరమఠంలో శారదా శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజున అమ్మవారు కామధేనువు అలంకరణలో దర్శనమిచ్చి భక్తులకు కనువిందు చేశారు. సాయంత్రం మఠం ప్రాంగణంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. న్యూనల్లకుంటలోని శ్రీసీతారాంమాంజనేయ సరస్వతి ఆలయంలో నిర్వహించిన శమీపూజలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ వై. అమృత, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పాల్గొన్నారు. – నల్లకుంట


రాజరాజేశ్వరి అలంకరణలో న్యూరామాలయం సరస్వతీదేవి


కామధేనువు అలంకరణలో శంకరమఠం శారదాంబ


లలితాదేవిగా వివేక్‌నగర్ దుర్గానల్లపోచమ్మ


లలితాదేవిగా వివేక్‌నగర్ భువనేశ్వరిదేవి


అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో కనువిందు చేస్తున్న బాణసంచా


అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో రావణ దహణం చేస్తున్న వీహెచ్, దేవాస్థాన సేవాసమితి ప్రతినిధులు




అంబర్‌పేట దసరా వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


బాకారం బొమ్మలగుడి వద్ద ధర్మాచరణ సమితి ఆధ్వర్యంలో రావణ దహన కార్యక్రమం, భారీగా హాజరైన ప్రజలు

దసరా సంబురం



- అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో వేడుకగా రావణ దహనం
- హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ
- వీహెచ్ చేతుల మీదుగా రావణ దహనం కార్యక్రమం

దసరా సంబరాలు అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో అంబరాన్నంటాయి. వేలాది ప్రజలు దసరా వేడుకల్లో పాల్గొని వేడుక చేసుకున్నారు. ఉదయం ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం జమ్మి చెట్టుకు పూజలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రావణ దహనం వంటి కార్యక్రమాలను ప్రజలు కనులారా తిలకించారు. గురువారం అంబర్‌పేట దేవాస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, అమ్మవారి ఊరేగింపు, బాణసంచాల మిరిమిట్లు అధ్యాంతం దసరా ఉత్సవాలు ఆకట్టుకున్నాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఈ వేడుకలకు హాజరయ్యారు. మాజీ ఎంపీ వీ.హనుమంతారావు చేతుల మీదుగా రావణ దహణం జరిగింది. ఈ వేడుకలకు అంబర్‌పేట నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు విచ్చేసి వేడుకలను తిలకించారు.
– అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ బృందం


దసరా వేడుకల్లో భాగంగా అమ్మవారి ఊరేగింపులో భారీగా హాజరైన భక్తజనం


మహిషాసుర దహనం


జవహర్‌నగర్‌లో మహిషాసుర దహన కార్యక్రమంలో బీజేపీ నేత వినయ్‌కుమార్


అనంతరాయశర్మను సన్మానిస్తున్న నిర్వాహకులు


ఎమ్మెల్యే ముఠా గోపాల్ దంపతులకు సన్మానం

శుభాకాంక్షలు

ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కాంగ్రెస్ నేత గుర్రంచంద్రకళ శంకర్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపిన ఆయా పార్టీల నేతలు, మంత్రి వివేక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జంగా శ్రీనివాస్, మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కృష్ణగౌడ్













అలయ్.. బలయ్

హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'అలయ్.. బలయ్' కార్యక్రమానికి అంబర్‌పేట నియోజకవర్గం నుంచి పలువురు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. శుక్రవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్, నాయకులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, ఎడెల్లి అజయ్‌కుమార్, కెంచె చంద్రశేఖర్ అదే విధంగా బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు హాజరయ్యారు.
- అంబర్‌పేట



మనువాదంతో దేశ ఐక్యతకు విఘాతం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మనువాదంతో దేశ ఐక్యతకు విఘాతం కలుగుతుందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. దేశంలో వేల ఏళ్లుగా కొనసాగుతున్న కుల ఆర్థిక అసమానతలను అంతం చేయడమే కేవీపీఎస్ లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం చిక్కడపల్లిలోని కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో 28వ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించిన అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడారు. 78 ఏళ్ల స్వాతంత్ర్యం తరువాత కూడా నేటికి గుడి, బడిలో వివక్ష కొనసాగుతోందన్నారు. ఈ వివక్ష దేశ ప్రజల ఐక్యతకు, దేశ అభివృద్ధికి విఘాతం కలుగుతుందన్నారు. కులవ్యవస్థను సమర్థించే వారు పాలకులుగా ఉండటం వల్ల నేటికీ వివక్షత కొనసాగుతోందని అన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడగు భాస్కర్, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్, ఎండీ అబ్బాస్, ఎంవి రమణ, బుర్రి ప్రసాద్, కోటా రమేష్, పి.ఆశయ్య, శోభన్ నాయక్, ఎస్. మనోహర్ రెడ్డి, ఎస్. రమేష్ రెడ్డి, ఆర్.వివేక్, అయిలినేని కిషన్‌రావు, ఎండి రఫీ , అహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


కేవీపీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న జాన్‌వెస్లీ

సాయిబాబా సమాధి ఉత్సవాలు షురూ

కవాడిగూడ: సాయిబాబా 107 సమాధి ఉత్సవాలు గురువారం తాళ్లబస్తీలోని బాబా ఆలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీసాయి ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ ఈనెల 2 నుంచి 10వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సాయిబాబా సమాధి ఉత్సవాలు నగరంలో ఎక్కడా జరగవని తెలిపారు. 41 సంవత్సరాలుగా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని అన్నారు. గురువారం బాబాకు ప్రత్యేక పూజలు, శుక్రవారం ధునిపూజ, శనివారం పుష్పార్చన, ఆదివారం అన్నదానం, సోమవారం పల్లకీసేవ, మంగళవారం మంగళగౌరీ పూజ, బుధవారం పాలు పంపిణీ, గురువారం ప్రత్యేక అభిషేకం, శుక్రవారం సాయిబాబా రథోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

'ఆర్ఎస్ఎస్ మధుర జ్ఞాపకాలను పంచింది'

భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

అంబర్‌పేట: ఆర్ఎస్ఎస్‌తో ఉన్న అనుబంధం తనకు ఎన్నో మధుర జ్ఞాపకాలు పంచాయని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. గురువారం బర్కత్‌పుర కేశవ నిలయంలో ఉన్న ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ కార్యాలయానికి విచ్చేసి ఆర్ఎస్ఎస్ జ్యేష్ఠ ప్రచారక్ భాన్‌సింగ్‌జీతో పాటు ఇతర ప్రచారక్‌లతో కలిసి ముచ్చటించారు. సుదీర్ఘ అనుబంధాన్ని వారితో ఆయన నెమరువేసుకున్నారు. ఆర్ఎస్ఎస్ ఇచ్చిన 'ప్రతి భారతీయుడి మొదటి ప్రాధాన్యం దేశం' అనే నినాదం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని అన్నారు. ఆర్ఎస్ఎస్ సహకారంతో తాను దేశానికి సేవలందించే అవకాశం లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంత ప్రచారక్‌లు లింగం, శ్రీధర్, శ్యాంప్రసాద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


బర్కత్‌పుర ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో వెంకయ్యనాయుడు

రైల్వే స్టేషన్ పరిశుభ్రత ప్రతి ప్రయాణికుడి బాధ్యత

అంబర్‌పేట: రైల్వే స్టేషన్ల పరిశుభ్రత ప్రతి ప్రయాణికుడి బాధ్యతగా భావించాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. గురువారం 'స్వచ్ఛతా హీ సేవా..' కార్యక్రమంలో భాగంగా కాచిగూడ రైల్వేస్టేషన్ ఎదుట 'శ్రమదానం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై స్టేషన్ ఎదుట చీపురు పట్టి ఊడ్చారు. అనంతరం జీఎం మాట్లాడుతూ.... 'స్వచ్ఛతా హీ సేవా...' కార్యక్రమం నిరంతర ప్రక్రియగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని 11 ఏళ్లుగా నిర్వహిస్తూ పరిశుభ్రత ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛ మిషన్‌లో భాగస్వామ్యం కావడానికి ప్రతి ఒక్కరిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం స్వచ్ఛత మిషన్‌పై ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమకంలో అదనపు జీఎం సత్యప్రకాశ్, డివిజనల్ మేనేజర్ సంతోష్‌కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



మహనీయుల త్యాగాలను మరువొద్దు

గాంధీనగర్‌లో మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి వేడుకలు గురువారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు గాంధీ, శాస్త్రీల విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... మహనీయుల త్యాగాలను మరువొద్దని... వారిని స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు నడువాలన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు విదేశీ వస్తువులను నిషేధించి, స్వదేశీ వస్తువులను వాడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేయాలని కోరారు. – చిక్కడపల్లి



ఘనంగా మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీ జయంతి వేడుకలు




గాంధీనగర్‌లో గాంధీ, శాస్త్రీకి నివాళులర్పిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ నేతలు వినయ్‌కుమార్, పూసరాజు, రమేష్‌రామ్, నవీన్